తరగని దూరం..!


దేవలంపేట నుంచి తుంబకుప్పంకు ఉన్న మట్టి రోడ్డు

పలమనేరు నుంచి జగమర్ల మీదుగా తుంబకుప్పం రోడ్డు పనులు ఎప్పుడు ప్రారంభమవుతాయోనని ఆరు మండలాల ప్రజలు కొన్నేళ్లుగా ఎదుచూస్తున్నారు. కేవలం అడవిలో ఆరు కిలోమీటర్ల పెండింగ్ మట్టిరోడ్డును తారురోడ్డుగా మారిస్తే ఆరు మండలాలకు రాకపోకలు పెరగడంతో పాటు ఆ ప్రాంతంలోని గిరిజన గ్రామాలకు రవాణా సౌకర్యం కలుగుతుంది. ఈ సమస్య పరిష్కరిస్తామన్న పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ హామీ ఎప్పటికి నెరవేరుతుందోనని ప్రజలు ఎదురు చూస్తున్నారు.

- తుంబకుప్పం రోడ్డు కోసం అటవీ గ్రామాల ఎదురుచూపు
- ఆరు కిలోమీటర్ల రోడ్డుపని చేస్తే ఆరు మండలాలకు దారి!
- అరగొండ, కాణిపాకాలకు 25 కి.మీ తగ్గనున్న దూరం
- పనులు చేస్తే ఆరు గిరిజన గ్రామాల బతుకుల్లో వెలుగు రేఖలు
- నిర్లక్ష్యం వహిస్తున్న పాలకులు


పలమనేరు: పలమనేరు నుంచి వయా గాంధీనగర్, జగమర్ల మీదుగా దేవళంపెంట వరకు గతంలో మట్టిరోడ్డుగా ఉండేది. గత ప్రభుత్వ హయాంలో దీనిని తారురోడ్డుగా మార్చడంతో వాహనాలు సైతం జగమర్ల వరకూ తిరుగుతున్నాయి. గిరిజనులు ఎక్కువగా ఉండే దేవలంపెంట నుంచి తుంబ కుప్పంలకు కేవలం ఆరుకిలోమీటర్లు మాత్రమే. ప్రస్తుతానికైతే మట్టిరోడ్డు ఉన్నప్పటికీ వాహనాలు వెళ్లేందుకు ఇబ్బందికరంగా ఉంది. ఈరోడ్డును తారు రోడ్డుగా మార్చితే ఆరు మండలాలకు (పలమనేరు, గంగవరం, పెద్దపంజాణి, బంగారుపాళెం, తవణంపల్లె, సోమల) రాకపోకలు కలిగి ప్రజలకు ఎంతో ఉపయోగంగా ఉంటుంది.

అరగొండ, కాణిపాకాలకు తగ్గనున్న ప్రయాణ దూరం

ప్రస్తుతం పలమనేరు నుంచి అరగొండ, కాణిపాకానికి ఎక్కువగా ప్రజలు, భక్తులు వెళుతుంటారు. ముఖ్యంగా అరగొండలో అపోలో వైద్యసేవలు, కాణిపాకంలో వరసిద్ధుని దర్శనార్థం ఈ ప్రాంతం నుంచి పెద్దసంఖ్యలో వెళ్లడం పరిపాటి. అక్కడికి వెళ్లాలంటే పలమనేరు నుంచి బంగారుపాళెం లేదా చిత్తూరుకు వెళ్లి ఆపై కాణిపాకం, అరగొండలకు వెళ్లవలసి వస్తోంది. అదే ఈ మార్గం రెడీ అయితే అయితే పలమనేరు నుంచి 25 కిమీ దూరం తగ్గుతుంది. మరో వైపు మొగిలి ఘాట్‌లో హైవేకి సంబంధం లేకుండా వాహనాలు అడవి మార్గంలో రాకపోకలను సాగించే అవకాశం కలుగుతుంది. అంతేకాకుండా బెంగళూరు–చెన్నై హైవేలో ట్రాఫిక్ కూడా తగ్గుతుంది.

పలు ప్రాంతాలకు కలిపే మార్గంలా...

పీలేరు, పూతలపట్టు, తవణంపల్లె, సదుం, సోమల, చౌడేపల్లెలకు వెళ్లేందుకు ఈ మార్గం అనుకూలం. ఇక పలమనేరు, బంగారుపాళ్యం, తవణంపల్లె, సోమల, పెద్దపంజాణి మండలాలలోని ఆరు మారుమూల అటవీ గ్రామాలకు రాకపోకలు కలుగుతాయి. ఇక ఆ మండలాల్లోని గిరిజన గ్రామాలైన జగమర్ల, యానాది కాలనీ, గంగవరం మండలంలోని కొత్తపల్లె , కీలపట్ల, పెద్దపంజాణి మండలంలోని పెద్ద ఉప్పరపల్లె తదితర మారుమూల పల్లెలు అభివృద్ధి చెందుతాయి. ఇక్కడ గిరిజనులు పండించే మామిడి, ఇతర వ్యవసాయోత్పత్తులను కూడా రవాణా చేసేందుకు వీలవుతుంది. ఇక పాడి పరిశ్రమ మరింత అభివృద్ధి చెందుతుంది. బెంగళూరు నుంచి తిరుపతికి సైతం ఈ మార్గం దగ్గరి దారిగా మారి ఎంతో సౌలభ్యంగా ఉంటుంది. దీనిని దృష్టిలో ఉంచుకుని ఈ రోడ్డు మార్గాన్ని అభివృద్ధి చేయాల్సిన బాధ్యత ప్రజా ప్రతినిధులు, అధికారులపై ఎంతైనా ఉంది.


మూడు మండలాలకు మధ్యనున్న దేవలంపెంట

ఆరు కిలోమీటర్లు తారురోడ్డు వేస్తే చాలు



పలమనేరు నుంచి మా ఊరికి గత ప్రభుత్వ పాలనలో తారురోడ్డు వేశారు. మా ఊరి నుంచి దేవలంపెంట దాకా ఇప్పటికే రోడ్డు ఉంది. అక్కడి నుంచి తుంబకుప్పానికి వెళ్లే దారిలో ఆరు కిలోమీటర్లు మాత్రం పెండింగ్‌లో ఉంది. దీన్ని వేస్తే మాకే కాదు..ఎందరికో మేలు చేసినట్లవుతుంది.

–విజయ్, సర్పంచ్, జగమర్ల, పలమనేరు మండలం

రైతులకు ఎంతో మేలు



మేము పండించిన వ్యవసాయోత్పత్తులను బంగారుపాళెం, పుంగనూరు, చౌడేపల్లె, సోమలకు తరలించాలంటే పలమనేరు హైవేలోకెళ్లి బంగారుపాళెం వెళ్లాలి. సోమల, చౌడేపల్లెకు వెళ్లాలంటే పలమనేరుకు వెళ్లి చౌడేపల్లె, పుంగనూరు మార్గాల్లో చుట్టు తిరిగి వెళ్లాల్సి వస్తోంది. అదే తుంబకుప్పం రోడ్డు పనులు చేస్తే రైతులు, ప్రజలకు ఎంతో మేలు. దీనిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

–రెడ్డెప్పరెడ్డి, జగమర్ల, పలమనేరు మండలం

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన


అమ్మవారి విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న వేద పండితులు

వి.కోట: మండలంలోని బంగ్లాఊరులో శుక్రవారం బాటగంగమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన అంగరంగ వైభవంగా వేద పండితుల మంత్రోచ్ఛరణ నడుమ నిర్వహించారు. ఉదయం నిర్వహించిన విగ్రహ ప్రాణ ప్రతిష్ఠాపన, కుంభాభిషేకానికి గ్రామంలోని ప్రతి కుటుంబ నుంచి దంపతులు పాల కలశాలతో ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి అభిషేకం చేశారు. అనంతరం వివిధ హోమాలు శాస్త్రోక్తంగా చేశారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. అలాగే మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ సతీమణి పావనీగౌడ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నీలమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు శంకర్‌రెడ్డి, మునిరత్నం,ఇంద్రేష్ గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.


ప్రత్యేక పూజల్లో పావనీగౌడ, గ్రామస్తులు

క్లుప్తంగా

న్యాయం చేసే వరకు పోరాటం


ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేస్తున్న స్థానిక రైతులు

కుప్పం రూరల్: తమకు న్యాయం చేసే వరకు నిరసన పోరాటం ఆగదని కుప్పం మండలం, అవులనత్తం జెల్లిఫ్యాక్టరీ బాధితులు అన్నారు. శుక్రవారం ప్లకార్డులు చేతపట్టి జెల్లి ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనుమతులు లేని జెల్లి ఫ్యాక్టరీకి అధికారులు కొమ్ము కాస్తున్నారని ధ్వజమెత్తారు. నెల రోజులకు పైగా నిరసన దీక్షలు చేస్తున్నా అధికారుల్లో ఏమాత్రం చలనం లేదని, వారికి ప్రజల ప్రాణాల కన్నా జెల్లి ఫ్యాక్టరీ యాజమాన్యానికే అడుగులకు మడుగులొత్తడానికి ప్రాధాన్యత ఇస్తున్నారని ఆరోపించారు. కుప్పంకు ప్రాతినిధ్యం వహిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడైనా తమ సమస్యపై దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు.

నేడు వార్షికోత్సవం

పులిచెర్ల(కల్లూరు): మండలంలో దేవళంపేటలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం వార్షికోత్సవం ఘనంగా నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ తెలిపింది. జీర్ణోద్ధరణ పూర్తి చేసి 20 వసంతాలు పూర్తయిన సందర్భంలో స్వామి వారి ప్రాణ ప్రతిష్ఠ రోజున ప్రత్యేక పూజలు, 11గంటలకు కల్యాణోత్సవం, 12 గంటలకు ప్రాకారోత్సవం నిర్వహిస్తామని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

పీర్ల మాన్యం ఆక్రమణలపై సర్వే

పుంగనూరు: పట్టణంలో ఎన్ఎస్ పేటలోని శుభారాం డిగ్రీ కళాశాల వెనుక ఉన్న కోట్లాది రూపాయల విలువ చేసే పీర్ల మాన్యం భూములను శుక్రవారం సర్వే చేశారు. ఈ భూములు ఆక్రమణలను గురయ్యాయని సున్ని అంజుమన్ కమిటీ సభ్యులు రెవెన్యూ అధికారులు, కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సర్వే నంబరు 43/1లో కోట్లాది రూపాయల విలువ చేసే 3.52 ఎకరాల భూమిని పలువురు ఆక్రమించేందుకు కుట్రలు పన్నడంతో సున్ని అంజుమన్ కమిటీ సభ్యులు ఇటీవల అడ్డుకున్నారు. భూముల ఆక్రమణలపై నిరసన వ్యక్తం చేశారు. ప్రస్తుతం సర్వే చేయడంతో భూ ఆక్రమణలకు చెక్ పెట్టినట్టైంది. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కంటి ఆపరేషన్లకు 10మంది ఎంపిక


ప్రభుత్వాసుపత్రిలో కంటి వైద్య పరీక్షలను నిర్వహిస్తున్న నిపుణురాలు


చౌడేపల్లె: ఉచిత కంటి వైద్య శిబిరంలో10 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేసినట్లు వైద్యాధికారి పవన్‌కుమార్ శుక్రవారం తెలిపారు. స్థానిక ఆసుపత్రిలో నిర్వహించిన వైద్య శిబిరంలో కోలార్ లోని ఆర్ఎల్ జాలప్ప కంటి ఆసుపత్రి వైద్యురాలు డాక్టర్ రచన ఆధ్వర్యంలో సుమారు 70 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. సిఫార్సు చేసిన పది మంది రోగులకు కంటి ఆపరేషన్ల అనంతరం స్వగ్రామాలకు తరలిస్తామన్నారు.

క్రీడల విజేతలకు బహుమతులు


విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

కుప్పం రూరల్: కుప్పం నర్సింగ్ కళాశాలలో వార్షిక క్రీడలు నిర్వహించి విజేతలకు శుక్రవారం బహుమతులు అందజేశారు. వాలీబాల్, ఫుట్‌బాల్, చెస్, రన్నింగ్‌రేస్, బ్యాడ్మింటన్ క్రీడలు నిర్వహించారు. బీసీఎన్ విద్యాసంస్థల చైర్మన్ నాగరాజు మాట్లాడారు. క్రీడల్లో పాల్గొంటే చురుగ్గా ఉంటారని, ప్రతి ఒక్కరూ ఏదో ఒక క్రీడలో అభినివేశం కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ సునీల్‌రాజ్, సీఈఓ సాగర్‌రాజ్, పీ ఆర్వో ప్రవీణ్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రం తనిఖీ


రోగిని పరిశీలిస్తున్న జిల్లా లెప్రసీ ఆఫీసర్ వెంకట ప్రసాద్

పెద్దపంజాణి: మండలంలోని పెద్దపంజాణి ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా లెప్రసీ ఆఫీసర్ డాక్టర్ వెంకట ప్రసాద్ శుక్రవారం తనిఖీ చేశారు. పీహెచ్‌సీలోని రికార్డులను పరిశీలించారు. ఆరోగ్య కేంద్రానికి వచ్చిన రోగులకు పరీక్షలు నిర్వహించి ముగ్గురికి క్షయ వ్యాధి ఉన్నట్లు నిర్ధారించారు. కార్యక్రమంలో వైద్యాధికారి మురళి, డీపీఎంలు దేవదాసు, జాన్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం షాపులకు 8 టెండర్లు

కుప్పం: నియోజకవర్గంలోని గుడుపల్లె మండల జనాభా ప్రాతిపదికన కల్లుగీత కార్మికులకు ఉద్దేశించి ప్రభుత్వం అదనంగా మంజూరు చేసిన మద్యం షాపులకు శనివారం గడువు తేదీ ముగిసేవేళకు మొత్తం 8 మంది టెండర్లు దాఖలు చేశారని ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖ అధికారులు తెలిపారు. డ్రాలో మద్యం షాపులు పొందిన వారు నిబంధనల ప్రకారం మద్యం షాపును నిర్వహించాల్సి ఉంటుందని చెప్పారు. గీత కార్మికుల (ఈడిగ కులస్తులు) ద్వారా ఒక్క షాపుకోసం ఎనిమిది టెండర్లు వచ్చాయి.

నులి పురుగులను నిర్మూలిద్దాం

పుంగనూరు: కుష్ఠు రహిత సమాజానికి, నులిపురుగుల నిర్మూలనను ప్రతి ఒక్కరూ సహకరించాలని స్థానిక అర్బన్ హెల్త్ సెంటర్ మెడికలాఫీసర్ డాక్టర్ రంజిత , లెప్రసీ యూనిట్ మెడికలాఫీసర్ వెంకటప్రసాద్ కోరారు. శుక్రవారం జాతీయ కుష్ఠు, నులి పురుగుల దినోత్సవాల పోస్టర్లను విడుదల చేసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. కుష్ఠు వ్యాధిగ్రస్తులకు దుస్తులు, బెడ్‌షీట్లు పంపిణీ చేసి మాట్లాడారు. కుష్ఠు అనుమానితులను గుర్తించేందుకు ఆశావర్కర్లు, ఏఎన్ఎంలను ఇళ్ల వద్దకు పంపుతున్నట్టు చెప్పారు. పాఠశాలలు, కళాశాలల్లో ఈనెల 10 నుంచి నులిపురుగుల నివారణకు మందులు పంపిణీ చేస్తామన్నారు. డాక్టర్లు జయేష్, దేవదాస్, సాంబశివ, జాన్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

రొంపిచెర్లలో..

రొంపిచెర్ల: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం నులి పురుగుల నివారణ టాస్క్‌ఫోర్స్ సమావేశం నిర్వహించారు. అధికారులు పోస్టర్లను ఆవిష్కరించారు. ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలలో ఆల్బెండజోల్ మాత్రలు పిల్లలకు విధిగా 10వ తేదీన వేయాలన్నారు. డాక్టర్లు వినయ్, దినేష్ కుమార్ నాయక్, ఎంఈఓలు ఇందిర, శ్రీనివాసులు, సీహెచ్‌ఓ కాంతమ్మ, మండల ఆరోగ్య విద్యాధికారి రాజేశ్వరి, సూపర్‌వైజర్ పంకజ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.


పుంగనూరు: పోస్టర్లు ఆవిష్కరిస్తున్న డాక్టర్లు రంజిత, వెంకటప్రసాద్

పలమనేరులో..

పలమనేరు: ఈనెల 10న మండలంలో 1 నుంచి 19 ఏళ్ల వారికి ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేయనున్నట్టు ఎంపీడీఓ ఖాదర్‌బాషా తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను శుక్రవారం ఆవిష్కరించారు. తహసీల్దార్ ఇన్బునాథన్, డాక్టర్ సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

పెద్దపంజాణిలో..

పెద్దపంజాణి: నులి పురుగుల నివారణ దినోత్సవంపై శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఎస్.రెడ్డెప్ప ఎంపీడీఓ బాలాజీతో కలసి సమీక్షించారు. పోస్టర్లను ఆవిష్కరించి ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసి మాట్లాడారు. వైద్యాధికారులు మురళి, నందిని, ఎంఈఓ గోపాల్ రెడ్డి, పంచాయతీ విస్తరణాధికారి శారదాదేవి, ఏఓ భాస్కర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కుప్పంలో..

కుప్పం: ఈ నెల 10 తేదీన మండలంలో నులి పురుగుల నిర్మూలన దినోత్సవం విజయవంతం చేయాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ విజయ్‌పథ్ కోరారు. మండల పరిషత్ కార్యలయంలో దీనికి సంబంధించి వాల్ పోస్టర్లు ఆవిష్కరించి మాట్లాడారు. వైద్యులు డాక్టర్ సుభాష్ రాజ్, జస్వంత్, దీప్‌కుమార్ , సాయి హిమాన్, ఎంఈఓ మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

గుడుపల్లెలో..

గుడుపల్లె: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం వైద్యశాఖ, అంగన్‌వాడీ, విద్యాశాఖ అధికారులకు నులి పురుగుల నిర్మూలన దినోత్సవంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. లక్ష్యం మేరకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీని వంద శాతం పూర్తి చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.


పెద్దపంజాణిలో..


రొంపిచెర్ల పీహెచ్‌సీలో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అధికారులు


గుడుపల్లెలో..

పూత పూసింది..మోము విరిసింది


మామిడి తోటల్లో పూసిన పూత

సదుం: నియోజకవర్గంలోని ప్రధాన పంటల్లో మామిడి ఒక్కటి. చౌడేపల్లె, సోమల, సదుం, పులిచెర్ల, రొంపిచెర్ల మండలాలల్లో సుమారు 30 వేల ఎకరాలల్లో మామిడి సాగులో ఉంది. ప్రతికూల వాతావరణ పరిస్థితులతో జనవరిలో సైతం పూత రాకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందారు. ఈసారి నష్టాలు తప్పేలా లేవని భావించారు. కానీ ప్రస్తుతం మారిన వాతావరణంతో తోటలలో పూత విరబూయడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. దాదాపు 80 శాతం తోటలలో పూత వచ్చిందని ఉద్యానవన శాఖ అధికారిణి సంతోషి కుమారి తెలిపారు. పూత బాగుండడం, పరిస్థితులు ఇలాగే అనుకూలిస్తే ఎకరాకు నాలుగు టన్నుల వరకు దిగుబడి వచ్చే అవకాశం ఉందని ఆమె చెప్పారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

–ఐసీడీఎస్ పీడీ వేంకటేశ్వరి

రొంపిచెర్ల: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు పబ్లిక్ పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఐసీడీఎస్ పీడీ వేంకటేశ్వరి అన్నారు. శుక్రవారం ఆమె స్థానిక బాలికల ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాలలో 363 మంది విద్యార్థులు చదువుతున్నారని తెలుసుకున్నారు. చదువులో వెనుక బడిన విద్యార్థులను ఉపాధ్యాయులు గుర్తించి వారిపై ప్రత్యేకశ్రద్ధ వహించి విద్యాబోధన చేయాలన్నారు. లో మధ్యాహ్న భోజనం ఎలా ఉందో ఆరా తీశారు. ఆకుకూర పప్పు, అన్నం తిన్నట్టు విద్యార్థులు ఆమెకు చెప్పారు. పాఠశాలలో నాడు–నేడు పథకంలో జరుగుతున్న తరగతి గదుల పనులు నిలిచి పోయాయని పీడీ దృష్టికి ఉపాధ్యాయులు తీసుకువచ్చారు. అనంతరం రొంపిచెర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, ఫజులుపేట అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎంత మంది డాక్టర్లు ఉన్నారో ఆరా తీశారు. మహిళలకు వైద్య పరీక్షలు చేయడానికి మహిళా డాక్టర్ లేక పోతే ఎలా? అని ప్రశ్నించారు. స్టాఫ్ నర్సు ద్వారా పరీక్షలు చేయిస్తున్నట్లు వైద్యులు ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ ఇందిర, డాక్టర్ వినయ్, బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మీదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


రొంపిచెర్ల బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న పీడీ వేంకటేశ్వరి

గడ్డివామి దగ్ధం

చౌడేపల్లె: మండలంలోని పెద్దకొండామర్రి వద్ద గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో గడ్డివామి దగ్ధమైన సంఘటన చోటుచేసుకుంది. స్థానికుల కథనం.. గ్రామానికి చెందిన తలారి మల్లికార్జున సమీపంలోని మామిడితోటలో గడ్డివామి ఏర్పాటు చేశారు.మందుబాబులు అక్కడే మద్యం తాగి వామికి నిప్పు అంటించడంతో కాలి బూడిదైంది .ఈ ఘటనలో సుమారు రూ.20 వేలు ఆస్తినష్టం వాటిల్లింది.

నీలగిరి చెట్లకు నిప్పు పెట్టారు

మండలంలోని పాదలపల్లె వద్ద బి.నరేష్‌కు చెందిన నీలగిరి చెట్లకు శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించారు. మంటలను గమనించిన స్థానికులు పుంగనూరు ఫైర్‌స్టేషన్‌కు సమాచారమివ్వడంతో ఫైర్ సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను ఆర్పారు. అప్పటికే చెట్లు కాలి సుమారు రూ.20 వేల ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపారు.


పాదలపల్లె వద్ద మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

సింహ వాహనంపై వేణుగోపాలుడు


ఊరేగుతున్న స్వామివారు

వి.కోట:పట్టణంలో రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి స్వామి వారు సింహ వాహనం పురవీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. తొలుత ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, ఉత్సవసేవ నిర్వహించారు. ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి మంగళ వాయిద్యాల నడుమ ఊరేగించారు. మహిళలు స్వామి వారికి కర్పూర నీరాజనాలు సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రామచంద్రుడు, ఉభయదారుల కుటుంబ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించరూ!

పలమనేరు: పదకొండో పీఆర్సీ, డీఏ బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని స్థానిక పెన్షనర్ల అసోసియేషన్ కార్యదర్శి దొరస్వామి డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని అసోసియేషన్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం రిటైర్డ్ ఉద్యోగులను ఆదుకోవాలని, లైఫ్ సర్టిఫికెట్లను ఈ నెలాఖరులోపు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు విజయకుమార్, మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్య శిశువుకు జన్మ

బైరెడ్డిపల్లె: అంగన్‌వాడీ కేంద్రాల్లో పంపిణీ చేస్తున్న పౌష్టికాహారాన్ని గర్భవతులు సద్వినియోగం చేసుకుని ఆరోగ్యవంతమైన శిశువుకు జన్మనివ్వాలని సీడీపీఓ అరుణశ్రీ అన్నారు. బైరెడ్డిపల్లెలో శుక్రవారం అంగన్‌వాడీ టీచర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పౌష్టికాహారం గర్భిణులు, బాలింతలకు తప్పనిసరిగా ఇవ్వాలని, ఎఫ్ఆర్ఎస్ యాప్ ద్వారా ఎలాంటి అవకతవకలు జరగకుండా పంపిణీ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాజేంద్రబాలాజి పాల్గొన్నారు.


పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న సీడీపీఓ అరుణశ్రీ

వెట్టిచాకిరీ నిర్మూలనకు అందరి కృషి


మాట్లాడుతున్న న్యాయమూర్తి కృష్ణవంశి

పుంగనూరు: వెట్టిచాకిరీ నిర్మూలనకు అందరూ కృషి చేయాలని జూనియర్ సివిల్‌జడ్జి కె.కృష్ణవంశి అన్నారు. శుక్రవారం సాయంత్రం పట్టణంలో నక్కబండలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో బాండెడ్ లేబర్ దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులకు వెట్టిచాకిరి కార్మికుల గురించి వివరించారు. ఫ్యాక్టరీలు, ఇటుకల బట్టీలు, క్వారీలు తదితర ప్రాంతాలలో వెట్టిచాకిరీ కార్మికులు ఉన్నట్లు తెలిస్తే తక్షణమే ఇవ్వాలని, అలాంటి వారికి అధికారులు వెట్టి నుంచి విముక్తి కల్పించి, నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐ శ్రీనివాసులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హైస్కూల్‌ను తనిఖీ చేసిన ఆర్డీఓ


విద్యార్థులతో మాట్లాడుతున్న ఆర్డీఓ భవాని

పుంగనూరు: మండలంలోని గూడూరుపల్లె జెడ్పీ హైస్కూల్‌ను శుక్రవారం పలమనేరు ఆర్డీఓ భవాని తనిఖీ చేశారు. విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. మధ్యాహ్న భోజనం, ఉపాధ్యాయుల బోధన విధానాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ లీలామాధవి, హెచ్ఎం మహేష్ నారాయణ, సీడీపీఓ రాజేశ్వరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వడ్డెరల అభ్యున్నతికి కృషి


సమావేశంలో వడ్డెర నాయకులు

సదుం: వడ్డెరల అభ్యున్నతికి అందరూ కలసికట్టుగా కృషి చేయాలని నియోజకవర్గ వడ్డెర సంఘం అధ్యక్షుడు సుబ్రమణ్యం పిలుపునిచ్చారు. మండలంలోని రెడ్డివారిపల్లెలో వడ్డెరల సమావేశం నిర్వహించారు. మండల నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. కార్యక్రమంలో నాయకులు రమేష్, వెంకటరమణ, జయకుమార్, పరమేశ్వర్, శీనప్ప, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో జరిమానా

శాంతిపురం: మద్యం సేవించి వాహనం నడిపిన కేసులో నిందితుడికి కోర్టు జరిమానా విధించినట్టు రాళ్లబూదుగూరు ఎస్ఐ నరేష్ తెలిపారు. కొలమడుగుకు చెందిన పురుషోత్తం మద్యం మత్తులో వాహనం నడుపుతూ తమకు పట్టుబడ్డాడని, అతడిని కుప్పం కోర్టుకు హాజర పరచగా జడ్జి రూ 10 వేల జరిమానా, జరిమానా చెల్లించకపోతే వారం పాటు సాధారణ జైలు శిక్ష విధిస్తూ జడ్జి తీర్పునిచ్చారన్నారు. వాహనాలు నడిపే మైనర్లు, మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

16న వాలీబాల్ టోర్నీ

బైరెడ్డిపల్లె: గంగజాతర పురస్కరించుకుని పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో స్థానిక జెడ్పీ హైస్కూల్లో ఈనెల 16న వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ, చతుర్థ స్థానాల్లో విజేతలుగా నిలిచిన వారికి వరుసగా రూ.50,116, రూ. 30,116, రూ. 20,116. రూ.10,116 ఇవ్వనున్నట్టు చెప్పారు. రూ.1000 ప్రవేశ రుసుం చెల్లించాలని, క్రీడాకారులకు భోజన వసతి కల్పిస్తామన్నారు. వివరాలకు 9908585899, 9703226723, 9160988254 నంబర్లను సంప్రదించాలన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

కుప్పం రూరల్: కుప్పం, గుడుపల్లె మండలాల పరిధిలో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు రెస్కో డీఈ ప్రభాకర్ తెలిపారు. 132/33 కేవీ సబ్‌స్టేషన్‌లో చేయనున్న మరమ్మతుల దృష్ట్యా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని తెలియజేశారు.

మరో మూడు మండలాల్లో..

శాంతిపురం: స్థానిక సబ్‌స్టేషన్‌లో విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ శాంతిపురం, రామకుప్పం, వి.కోట మండలాల్లోని మొత్తం 22 సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు రెస్కో డివిజనల్ ఇంజినీర్ హిమ్మత్ సాగర్ తెలిపారు.